మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట



# యాసంగిలో ధాన్యం సేకరణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

● గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

**గద్వాల, ఏప్రిల్8 ప్రభాతవార్త:** 2024 -25 యాసంగి సీజన్ లో ధాన్యం సేకరణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు రబీ యాక్షన్ ప్లాన్ పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లు చేస్తామన్నారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లను ఏప్రిల్ మూడో వారంలో ప్రారంభించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, అవసరమైన గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు -మిగతా4లో..



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

# సన్న బియ్యంతో కలెక్టర్ల సహపంక్తి భోజనం

◆ పేదవాడి కడుపు నింపేందుకు
ప్రభుత్వ ప్రతిష్టాత్మక నిర్ణయం
సన్న బియ్యం పంపిణీ



## దొడ్డు బియ్యం పంపిణీకి బదులు సన్న బియ్యం పంపిణీ

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, ఏప్రిల్8 ప్రభాతవార్త:** పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూర్ గ్రామం ఎస్.సి.కాలనీలో రేషన్ కార్డు లబ్ధిదారుడు హెచ్.గోపాల్, భార్య సత్తమ్మల ఇంట్లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు లబ్ధిదారులతో కలిసి ప్రభుత్వం ఉచితంగా అందించిన సన్న బియ్యంతోతయారు చేసిన భోజనం చేశారు.లబ్ధిదారులు హెచ్.గోపాల్‌ను సన్నం బియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. దొడ్డు బియ్యం పంపిణీకి బదులు సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుందని అన్నారు. దొడ్డు బియ్యం తినేవారా అని అడిగారు. ఇప్పుడు సన్న బియ్యం ఎలా ఉంది అని అడిగారు. బాగుంది మేడం అని గోపాల్ అన్నారు.కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను తన భార్య ,ముగ్గురు కుమారులు, ఒక కూతురు మొత్తం 6 గురు కుటుంబ సభ్యులు అని గోపాల్ కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ప్రతి ఒక్కరూ రేషన్ షాప్‌ల ద్వారా తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంకు లబ్ధిదారుల జాబితాలో గోపాల్ భార్య సత్తమ్మ పేరు ఉందని తెలిపారు. గ్రామ యువత, గోపాల్ కుమారునితో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి పొందడానికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.ప్రభుత్వం 4లక్షల వరకు బ్యాంక్‌ల ద్వారా రుణం సబ్సిడీతో అందిస్తుందని తెలిపారు. మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్నారా అని అడిగారు. లేదు అని చెప్పడంతో కొత్తగా -మిగతా4లో..



సన్నబియ్యం లబ్దిదారుని ఇంట్లో వారితో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్, అధికారులు

## ప్రభుత్వం అందించే నాణ్యమైన సన్న బియ్యంను రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్8 ప్రభాతవార్త:** కొతకోట మండలం ముమ్మళ్లపల్లిలో ప్రభుత్వం అందించిన సన్న బియ్యంతో ఓ నిరుపేద కుటుంబంలో సహపంక్తి భోజనం చేశారు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. మంగళవారం కొత్తకోట మండల పరిధిలోని ముమ్మాల్లపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ముమ్మాల్లపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరైన సిసి రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.అనంతరం కలెక్టర్ అదే గ్రామానికి చెందిన అడ్డాకుల చరమందా, లక్ష్మి గృహాన్ని సందర్శించి, వారికి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న సన్నబియ్యం అందిందా లేదా అని ఆరా తీశారు.అప్పటికే సన్న బియ్యం తీసుకున్నామని సదరు కుటుంబ సభ్యులు బదులిచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ వారి ఇంట్లోనే ప్రభుత్వం ఉచితంగా అందించిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయాన్ని స్థానికులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఆలయంలో ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. గ్రామాల్లో ప్రజలు అందరూ ఎలాంటి తారతమ్యాలు లేకుండా సోదర భావంతో, కలిసికట్టుగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎవరైనా కుల వివక్ష చూపించడం జరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే నాణ్యమైన సన్న బియ్యంను రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేదలు కూడా నాణ్యమైన ఆహారం తినాలనే ఆలోచనతోనే ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకు వచ్చిందని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉన్న 19వ నెంబర్ రేషన్ షాపును కలెక్టర్ సందర్శించి రేషన్ కార్డుదారులకు సక్ర మంగా రేషన్‌పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట తహసిల్దార్ శ్రీనివాసులు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగరాజుగంధం, ముమ్మాళ్ళపల్లి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్

## పచ్చగట్టు,ఓంటిగట్లలో చిరుతపులులు సంచారం

◆ రాత్రి వేళల్లో అరుపులు, భయం భయంతో ప్రజలు



**లింగాల, ఏప్రిల్8 ప్రభాతవార్త:** నల్లమల ప్రాంతమైన లింగాల మండలంలోని పచ్చగట్టు, ఓంటిగట్లలో చిరుతపులులు సంచరిస్తున్నాయని, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామస్తులు భయం.. భయంతో.. వణికిపోతున్నారు. మండలంలోని కొత్త చెరువుతాండ,రాయవరం, ఆవుసలికుంట,ధారారం గ్రామాలు పచ్చగట్టు, ఓంటిగట్ల అడవులకు దగ్గరలో ఉన్నాయి. అయితే రాత్రి సమ యంలో చిరుతపులులు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్న అరుపులు వినిపిస్తున్నాయని సమీపంలోని గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల క్రితం అడవుల్లోకి వెళ్ళిన గొర్రెలను చిరుతపులులు చంపినట్లు గొర్రెల కాపరులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకు ఏలాంటి హాని జరగక ముందే అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఫారెస్ట్ అధికారుల వివరణ:** నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చగట్టు, ఓంటిగట్లలో చిరుతపులులు సంచారం చేస్తున్న విషయం వాస్తవమేన్నారు. అడవుల సమీపంలో ఉన్న గ్రామాలలోని ప్రజలను, గొర్రెల కాపరులు ఇంతకుముందే అటవీ ప్రాంతంలోనికి వెళ్ళకూడదని హెచ్చరించినట్లు ఫారెస్ట్ బీట్ అధికారి ఖాదర్ పాష తెలిపారు.

## మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

◆ స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్



**నారాయణపేట టౌన్, ఏప్రిల్8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్‌లో మాదకద్రవ్యాల నిషేధం (యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కేవలం గంజాయి కాకుండా బీడీ, సిగరెట్, మద్యం లాంటివి కూడా విద్యార్థులపై ప్రభావం చూపే ఆస్కారం ఉందని, కళాశాలల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డిఎస్పీ నల్లపు లింగయ్య స్పందిస్తూ జిల్లాలో 109 అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే గంజాయి సాగు, సరఫరాకు సంబంధించి జిల్లాలో 2022లో మూడు కేసులు, 2024లో మూడు కేసులు నమోదయ్యాయని ప్రస్తుతం ట్రయల్ నడుస్తున్నాయని డిఎస్పీ వివరించారు. ఇకపై జిల్లాలో మరెక్కడా ఇలాంటి కేసులు నమోదు కావడానికి వీలు లేకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అధికారులు మాదకద్రవ్యాల నిషేధంపై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిషేధించాలన్నారు.మాదకద్రవ్యాల నిషేదిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. వచ్చే సమావేశానికి జిల్లా ఆరోగ్య శాఖ అధికారి, సైకాలాజిస్టు కూడా అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మేఘా గాంధీ, ఎక్సైజ్ సిఐలు అశోక్ కుమార్, బాల కృష్ణ, ఎస్సైలు గురవయ్య, ఎల్ఎస్ శిరీషా, అటవీ శాఖ అధికారి సత్య నారాయణ, డీపీఆర్ఓ ఎంఏ రషీద్, డీఐఈవో సుదర్శన్, డీఈఓ గోవిందరాజులు, సీ సెక్షన్ అధికారిని అఖిల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి



మృతి చెందిన ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

**వెల్దండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** అచ్చంపేటకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దాపూర్ స్టేజి వద్ద చోటు చేసుకుంది. వివరాలకు వెళితే రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటకు చెందిన కింగ్లీకార్ ప్రవీణ్ కుమార్ అతని స్నేహితుడు గోపికృష్ణ తన సొంత పనిపై పెద్దాపూర్‌లో ఉన్న గురూజీని కలవడానికి ద్విచక్ర వాహనంపై పెద్దాపూర్ వస్తుండగా అదే గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు నిలుపగా వెనుక నుండే అచ్చంపేటకు చెందిన మరో ఆర్టీసీ బస్సు నిలిపి ఉన్న బస్సును ఓవర్టేక్ చేయగాఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు కింగ్లీకార్ ప్రవీణ్ కుమార్‌కు బస్సు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ పైన మరో వ్యక్తి గోపికృష్ణకు తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై కురుమూర్తి పరిశీలించి క్షతగాత్రునితోపాటు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య అక్షర ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. మృతుడు ప్రవీణ్‌కుమార్ మటన్ వ్యాపారం నిర్వహించేవాడని, గోపికృష్ణ స్వీటు దుకాణంలో పనిచేస్తుంటారని సమాచారం. మృతుడు ప్రవీణ్ కుమార్‌కు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## వ్యవసాయ పరిశోధనా ఫలాలు రైతాంగానికి చేరాలి

◆అన్నదాత ఆదాయాన్ని రెట్టింపు చేయాలి
◆వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధన జరగాలి
◆నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**బిజినేపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరిశోధనా ఫలాలు రైతాంగానికి చేరువ చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మంగళవారం దక్షిణ తెలంగాణ మండలం వ్యవసాయ పరిశోధన విస్తరణ వానాకాలం, యాసంగి 2025,26 సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాటాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ పరిశోధనలు జరగాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక మార్చాలని సూచించారు. శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరుస్తూ కొత్త పుంతలు తొక్కించాలని చెప్పారు. రైతులు సాగులో పంటల వైవిధ్యత, యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టిని సారించి కూలీల కొరతను అధిగమించే దిశగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. ఎం. బలరాం మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ మండలంలో విభిన్నమైన పంటల సరళి ఉందని,ఈ ప్రాంతంలో ఆహార పంటలు పప్పు దినుసులు, నూనె గింజలు పండిస్తారని తెలిపారు. గత ఏడాది సాగులో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధిక దిగుబడులను ఇచ్చే నూతన రకాలను, స్వల్పకాలిక కాలపరిమితి రకాలను అభివృద్ధి చేశారని వివరించారు. ప్రధానంగా చీడ పీడలను తట్టుకొని, నీటి ఎద్దడిని తట్టుకునే సాంకేతిక పద్ధతులను రూపొందించారని వివరించారు. రాబోయే వానాకాలం ఏసంగిలో వస్తున్న వ్యవసాయ మార్పులు కనుగుణంగా నూతన ప్రణాళికలను సిద్ధం చేస్తామని తెలిపారు. విస్తరణ సంచాలకులు డా. ఎం.యాకోద్రి మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులను సమాచారాన్ని వివిధ రకాల వినూత్న కార్యక్రమాలను చేపడుతూ రైతాంగానికి సకాలంలో తెలియజేస్తున్నామన్నారు.రైతన్న ఆదాయం రెట్టింపు అయ్యే మార్గాలపై సమగ్ర వ్యవసాయం, విత్తనోత్పత్తి విలువ ఆధారిత వ్యవసాయ యాంత్రికరణ రక్షిత సాగు ఇతర అంశాల పై రైతాంగానికి వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో దక్షిణ తెలంగాణ మండల విస్తరణ కేంద్రాలు రైతుల ఆదాయం రెట్టింపు కొరకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పాలెం పరిశోధన కేంద్రం ఏడిఆర్ డా.సి సుధాకర్ మాట్లాడుతూ గత ఏడాది సూచించిన ప్రణాళికా పరంగా రూపొందించిన పరిశోధనలు సాంకేతికతలపై వివరించారు. సాయిల్ సైన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వై సుచరిత మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు వ్యవసాయ శాఖ అనునిత్యం వ్యవసాయ విశ్వవిద్యాలయం కలిసి పనిచేస్తుందని తెలిపారు. ఆగ్రో ఫారెస్ట్ ప్రధాన శాస్త్రవేత్త డా. ఏవి రామాంజనేయులుమాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన పరిశోధన ఫలితాలు, అంశ్శా పై వివరించారు. కెవికె పాలెం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. పి. ప్రభాకర్ రెడ్డి దక్షిణ తెలంగాణ మండల విస్తరణ కేంద్రాలు చేపట్టినటువంటి వివిధ రకాల పరిశోధనలపై వివరించారు. ఈ సమావేశంలోవ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు





మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం

## ఉదండపూర్ నిర్వాసిత పునరావాస పనులు వేగవంతం చేయాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు పునరావాస పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్,సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మల కుంట తండా, రేగడి పట్టి తండా, చిన్నగుట్ట తండా, శామగడ్డ తండా, ఒంటి గుడిసె తండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్,పార్కులను త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లుఇచ్చిన గడువులోగాత్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని, రోడ్లు, డ్రైనేజీలు, సోక్ పిట్స్,ఎలక్ట్రిసిటీ మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్లాట్లకు అడ్డుగా వున్న ఎలక్ట్రిసిటీ పోల్స్‌ను రిలోకేట్ చేయాలని అన్నారు. నిర్వాసితులకు కేటాయించే స్థలం వద్ద నిర్వాసితులు వారు కోరిన చోట దేవాలయానికి స్థలం కేటాయించవలసిందిగా వారు కోరారని, ఆ స్థలంలో ముందుగా అనుకున్న సబ్ స్టేషన్ స్థానంలో దేవాలయానికి కేటాయించి, సబ్ స్టేషన్‌ను రిలొకేట్ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు స్థలం కేటాయించేందుకు సరిపోకపోతే సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వెంటనే ప్రపోజల్స్ పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్ రావు, స్పెషల్ కలెక్టర్ (ఎల్.ఎ.) మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్,ఇరిగేషన్, మిషన్ భగీరథ,సర్వేలాండ్ రికార్డు, పంచాయతీ రాజ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

## నాగర్‌కర్నూల్ కేజీబీవీలో డీఈఓ విచారణ

◆నివేదిక ఆధారంగా సంఘటనకు కారకురాలైన ఉపాధ్యాయురాలుకు షోకాస్ నోటీస్ జారీ చేసిన డీఈవో



విచారణ చేపడుతున్న డీఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్8 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలు కస్తూర్బాగాంధీ పాఠశాలలో యామిని అనే 9వ తరగతి విద్యార్థిని స్టడీ అవర్స్‌కు లేటుగా వచ్చిందని 3 గంటల పాటు నిలబెట్టిన ఇంగ్లీష్ టీచర్ కళ్యాణి వాటర్ తాగనీయకుండా,బాత్‌రూంకు కూడా వెళ్ళనీయకుండా పనిష్మెంట్ ఇచ్చిందని విద్యార్థిని యామిని మనస్థాపానికి గురైచేయి కోసుకున్న ఘటనపై నాగర్‌కర్నూల్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో జిల్లా బాలిక అభివృద్ధి అధికారిని శోభారాణితో కలిసిడీఈఓ రమేష్‌కుమార్ ఘటనపై పాఠశాలఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో విచారణ నిర్వహించారు. విద్యార్థినులను కలిసి ఉపాధ్యాయురాలి తీరు విద్యార్థులతో ప్రదర్శిస్తున్నతీరుపై ప్రశ్నించారు. నేడు చేపట్టిన సమగ్ర విచారణ నివేధికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ముందుగా సంఘటనకు కారకురాలైన ఆంగ్ల ఉపాధ్యాయురాలు కళ్యాణికి షోకాజ్ నోటీస్ జారీ చేశామని, ఉపాధ్యాయురాలు వివరణా తదనంతరం పూర్తిస్థాయిలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**లింగాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య సాధ్యమని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత,ప్రాథమికపాఠశాలలు అప్పాయిపల్లి, చెన్నంపల్లి, అంబట్ పల్లి, కోమటికుంట, శాయిన్‌పేట పాఠశాలల్లో చదువుతున్న ఏడవ,ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంబట్ పల్లి పాఠశాలలో ట్వినింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ ట్వినింగ్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులను తీసుకెళ్లి ఉన్నత పాఠశాలలో ఉన్న నాణ్యమైన విద్య ప్రమాణాలను విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై అవగాహనకల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే, వృత్తి విద్య ప్రమాణం కలిగిన అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంచే విద్య బోధన నిర్వహించబడుతుందని తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి,విద్యార్థుల జీవన ప్రమాణాలు పెంపొందించుకొని సమాజ శ్రేయస్సుకుప విధంగా పాటు పడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు, జ్యోతి రాణి, సుశీలమ్మ, ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాస్ రెడ్డి, అరవింద్, పర్వతాలు,శంకర్, సిఆర్పీలు హరిలాల్, విష్ణు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్వినింగ్ ప్రోగ్రామ్‌లో ఎంఈఓ బషీర్ అహ్మద్, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు

## అడ్డాకులలో టియుడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వాల జోరు



సభ్యత్వం తీసుకుంటున్న జర్నలిస్టు తిరుపతయ్య

**అడ్డాకుల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకులలో టియుడబ్ల్యు సభ్యత్వాల నమోదు కార్యక్రమం జోరుగా సాగింది. మంగళవారం యూనియన్ జిల్లా అడ్ హక్ సభ్యులు బిజీ రామాంజనేయులు, పేట వెంకటయ్య, సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వాల కార్యక్రమం కొనసాగించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులో యూనియన్ సభ్యత్వాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల జర్నలిస్టులు జర్నలిస్టుల ఇండ్ల సమస్యను పరిష్కరించాలని జిల్లా కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. తామంతా ఐజేయు యూనియన్ ఆధ్వర్యంలోనే కొనసాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకుడు రఘు పాల్గొన్నారు.

## మాన్యువల్ స్కావెంజర్స్ 22లోగా రిపోర్ట్ చేయాలి

● జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్‌లు పని చేస్తున్నట్లయితే జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 22 లోగా సమాచారం అందించాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. డా.బలరాం సింగ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యుపి.324/2020, సుప్రీం కోర్టు 2023 అక్టోబర్ 20నజారీ చేసిన ఉత్తర్వులు,2024 ఫిబ్రవరి ఒకటిన భారత ప్రభుత్వం మాన్యువల్ స్కావెంజర్‌పై జారీ చేసిన మార్గదర్శకాలు అనుసరించి జిల్లా కలెక్టర్ జిల్లా మాన్యు వల్ స్కావెంజర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 27న జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో మాన్యువల్ స్కావెంజర్‌లపై సర్వే చేసి ఏప్రిల్ 7వ తేదీ లోగా నివేదిక అందించాలని అన్నారు. సర్వే నివేదికలో జిల్లాలో ఎటువంటి మాన్యువల్ స్కావెంజర్ గుర్తించ లేదని తెలిపారు. సర్వే నివేదిక వచ్చిన తర్వాత ఇంకా ఎవరైనా మాన్యువల్ స్కావెంజర్ పని చేస్తున్నట్లు అయితే వారు సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకోవడానికి 15 రోజులు గడువు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్ పని చేస్తున్నట్లు అయితే వారు ఈ నెల 22 లోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, రూమ్ నం.105, మహబూబ్‌నగర్‌లో సమాచారం అందించాలని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎంపీపీ కార్యాలయ రికార్డులను తనిఖీ చేసిన జెడ్పి సీఈవో



రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈఓ

**నవాబుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రుద్రారం హరితహార నర్సరీలను మంగళవారం జెడ్పి సీఈవో వెంకట్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో మాట్లాడుతూ హరితహారం మొక్కలు హరితహారం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు ఉండాలని పంచాయతీ కార్యదర్శినిలకు సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణ సక్రమంగా నిర్వహించాలని, నర్సరీలో పెరుగుతున్న పిచ్చి మొక్కలన్నిటిని తొలగించి మొక్కల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. మొక్కలను సంరక్షించితే అవి మనల్ని రక్షిస్తాయని తెలిపారు. మొక్కల ను పెంచడం వలన అవి చెడు వాయువును ఆకర్షించి స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల చేస్తాయని తెలిపారు. అందువలన ప్రతి ఒక్కరు మొక్కలు నాటే విధంగా చూడాలని సూచించారు. అనంతరం మండలఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌యువ వికాస్ దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధికా రులు ఉన్నారు. జయరాం నాయక్, ఏపీఓ జ్యోతి మండల అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ చిన్నారి మృతి

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన పక్కి శ్రీశైలం గొర్రెల కాపరి పెద్ద కూతురు సుష్మ అలియాస్ సుకన్య వయస్సు 10 సంవత్సరములు ఈనెల ఆరవ తేదీన ఉదయం 10 గంటల సమయంలో తన చిన్న కూతురు నిచిత తండ్రికి ఫోన్ చేసి అక్క నోరు నుంచి నురగలు రావడం మాట్లాడలేని స్థితిలో ఉందని సమాచారం ఇచ్చింది. వెంటనే ఇంటికి వెళ్లిన శ్రీశైలం తన కూతురును మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 7వ తేదీ సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు. తండ్రి అనుమానం ప్రకారం విషపూరితమైన పాముకాటు లేదా మరి ఏదైనా కారణం చేత మృతి చెంది ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. మంగళవారం తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి





విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

**బిజినేపల్లి, ఏప్రిల్8 ప్రభాతవార్త:** విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా, ఆలోచనలకు పదును పెడితే వినూత్నమైన ఆలోచనలు సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే అవకాశం వస్తుందని మండల విద్యాధికారి రఘునందన్ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ గురు రాఘవేంద్ర పాఠశాలలో మంగళవారం కరికులం వాక్‌దన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి రఘునందన్ శర్మ మాట్లాడుతూ మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూల మని చెప్పారు.మనం చేసే ప్రతి పనిలోనూ సైన్స్ దాగి ఉంటుందని, సమాజానికి అవసరమయ్యే ఆవిష్కరణలు చేయడం ద్వారా పేదవారికి సేవ చేసినట్లవుతుందన్నారు. విద్యార్థులు పాఠ్య పద్ధతిని నడుస్తూ చూపించడం మెడల్స్ చాట్స్ ప్రయోగాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పద్మజా రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లయ్య గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామ్ రెడ్డి గోపాల్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మోహన్‌రావు, శ్రీనివాసులు

**గద్వాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** గద్వాల మున్సిపాలిటి పరిధిలో 17వ వార్డు, పాత హౌసింగ్ బోర్డు కాలనీ యందు అన్యాక్రాంతానికి గురియైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ సమితి, సినియర్ సిటీజన్ ఫోరం కన్వినర్ మోహన్‌రావు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు, దళిత ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాసులు మంగళవారం అదనపు కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారు. గద్వాల మున్సిపాలిటి పరిధిలో 17వ వార్డు పాత హౌసింగ్ బోర్డు కాలనీ యందున్న ప్రభుత్వ భూమిని రాజకీయ ప్రమేయంతో గుడిసె వేసి, దానిని రిజిస్టర్ చేసుకున్నారని వినతిపత్రం లో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని రాజకీయ పలుకుబడితో కబ్జాచేసి, అక్రమ రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. అట్టి దస్తావేజును సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ నందు రద్దుచేయించి, అట్టి స్థలంలో ప్రభుత్వ పరంగా ఒక బోర్డును పెట్టాలని కోరారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే శిక్షార్హులని తెలుపాలని కోరారు. గద్వాల మున్సిపల్ పరిధిలో 10 ల్యాండ్‌ను ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించి బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల ఆడిషనల్ కలెక్టరకి వినతి పత్రంను సమర్పించారు.

## విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ పైన ప్రత్యేక దృష్టి

◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



అడ్మిషన్ ఫాంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ పైన తాను ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ పాల్గొన్నారు. పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో మహబూబ్ నగర్ ఫస్ట్ పేరుతో నిరుద్యోగ యువతకు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని, అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ సమయంలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇచ్చిందని, వారంతా ఇప్పుడు వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. త్వరలో కొన్ని వేల ప్రభుత్వ ఉద్యో గాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వస్తాయని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కూడా పారదర్శకంగా తన విధులను తాను నిర్వర్తిం చడం జరుగుతుందన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా ఈ నెల 16 నుంచి ఎస్సై,పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు నిష్ణాతులైన అధ్యాపకులను నియమించి ఉత్తమమైన శిక్షణ ఇస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన టెట్, డిఎస్సీ పరీక్ష కోసం, విఆర్ఎ,విఆర్ఓ, గ్రూప్ 1,2,3, 4 వంటి ఉద్యోగాలకు ఉచిత శిక్షణ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అంతకుముందు పాత్రికేయ మిత్రులకు మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా ఉద్యోగార్థులకు శిక్షణ ఇచ్చే శిక్షకులు రవికుమార్‌లోకై (ఆర్థమెటిక్స్),గాది బాలరాజ్,(గణిత శాస్త్రం), నానియాదవ్( ఆర్థమెటిక్స్), బి.రాజేంద్రచారి,(ఇంగ్లీష్)లను పరిచయం చేశారు. అనంతరం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తయారు అవుతుందన్నారు. ఆ విషయం తెలిసిన వ్యక్తి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అని, వారు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేసితెలంగాణ సాధన కోసం తన పదవిని త్యాగం చేశారన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాలు పేరుతో 250 మంది మహిళలకు నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించడం, ఒక్క బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకుని, రెండవ బ్యాచ్ కూడా ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పేరుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకాలకు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించేందుకుఆయన కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. అందుకు ఎమ్మెల్యే గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఫస్ట్ కోచింగ్ సెంటర్ అడ్మిషన్ ఫాంను రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

## బూతు స్థాయిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు

◆ జిల్లా అధ్యక్షులు డి.నారాయణ



బిజెపి జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు డి.నారాయణ

**వనపర్తి రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర పార్టీ ప్రతి బూతు స్థాయిలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఈ మేరకు వనపర్తి పట్టణంలో మంగళవారం భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఏ. రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు డి. నారాయణ విచ్చేసి 12 వ వార్డు, 25 వ వార్డులో బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుడి.నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటు వంటి మోసపూరిత హామీలకు బలైనటువంటి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలం పాలన చూసి విసుగు చెందారని రానున్న రోజుల్లో కేవలం బిజెపి పార్టీనే గెలిపించే దిశగా ప్రజలఆలోచనలు మారాయని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వస్తే తెలంగాణ ప్రజల యొక్క కష్టాలు అన్నీ కూడా తీరుతాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత చూపు మొత్తం బిజెపి వైపు మొగ్గు చూపడం చాలా గర్వకారణం అని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలలో యువత, కార్యకర్తలు అందరు కూడా ప్రచారం చేసి అత్యధిక కౌన్సిలర్లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ సీనియర్ నాయకులు పికిలి బాల రాజ్, పద్మక్క ,పెద్దపులి కిరణ్, ప్రధాన కార్యదర్శిలు నవీన్, నల వోతుల అరవింద్, ఉపాధ్యక్షుడు ఉపేందర్ యాదవ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు రవి నాయుడు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చాణక్య ,శివ,పవన్,వేదాద్రి,కార్తీక్,చందు,విజయ్,బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు గుంట్ల ఉపేంద్ర యాదవ్, దాసర్ల రవి, సంజీవ రాజు, మన్నెం,గణేష్, రాములు, నాగరాజ్, శివ, నవీన్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఆఫ్‌లైన్ ద్వారా రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకోవాలి





ఇటిక్యాలలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులపై ఆరా తీస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

**ఇటిక్యాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ఉమ్మడి మండల పరిధిలోని గ్రామాలలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన వారి నుండి ఆఫ్‌లైన్, ఆన్ లైన్ పద్ధతి ద్వారా కూడా దరఖాస్తులు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఎంపీడీవోమహమ్మద్ మోహియుద్దీన్‌ను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం కింద ఇప్పటి వరకు ఎంత మంది దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు.అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు ఆన్‌లైన్‌లో 50 శాతం దాటిన పనులను ఆన్లైన్లో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ జయరామయ్య. సిబ్బంది ఉన్నారు.

## పేద ప్రజలకు అండగా ఉంటాం

● అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**అలంపూర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందజేస్తున్న పథకాల ను ప్రతి నిరుపేదకు అందజేస్తామని అలాగే వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరసాలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలంపూర్, ఉండవల్లి, మానవపాడు ,71మందికి అయిజ, ఉమ్మడి ఇటిక్యాల మండలాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.37 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు కిషోర్, పుల్లూరు రఘు రెడ్డి, మన శ్రీనన్న,మునుగాల శ్రీనివాసులు, విజయ్ పాల్గొన్నారు.

## పీయూలో సాంప్రదాయ దినోత్సవ వేడుకలు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్8 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ పీజీ కాలేజీలో ఎంబీఏ విభాగం అధ్వర్యంలో సాంప్రదాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ డా. మధుసూదన్ రెడ్డి హాజరై ఈ రోజున మన దేశం యొక్క విశేషమైన సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ, మన పురాతన ఆచారాలు, వేషధారణ, కళలు జీవనశైలిని జరుపుకోవడం ఒక గొప్ప గౌరవం అని, మన మూలాలపైన నిలబడి, ఆనందంగా ఈ సంప్రదాయ దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకోవాలని అందరికి సంప్రదాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణయ్య ,విభాగాధిపతి డా. జావేద్‌ఖాన్, అధ్యాపకులు డా.అర్జున్ కుమార్, డా.అరుంధతిరెడ్డి, డా. నాగసుధ, విద్యార్థులు పాల్గొన్నారు.



పియులో సంప్రదాయ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఆలయ నిర్మాణానికి విరాళం

**బాలానగర్, ఏప్రిల్8 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రం లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలోని నూతన శ్రీ రామాలయ నిర్మాణానికి మంగళవారం మండల కేంద్రానికి చెందిన వంగూరి యాదయ్య రూ. 1,11,999 చెక్కును సునీల్ కుమార్, గాండ్ల ప్రభాకర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు శ్రీరామ దేవాలయ నిర్మాణానికి తమకు తోచినంత విరాళాలు ఇచ్చి శ్రీరాముని కృపకు పాత్రులు కాగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, శ్రీకాంత్, అశోక్, దినేష్, రాఘవేందర్, భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పూలే విగ్రహావిష్కరణ

**బిజినేపల్లి, ఏప్రిల్8 ప్రభాతవార్త:** అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహా విష్కరణకు సబ్బండ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంఘం మండల కార్యదర్శి అతినారపు బాల లక్ష్మయ్య సాగర్ కోరారు.అణగారిన కులాల అభ్యున్నతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సామాజికవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకోవడం బడుగు బలహీన వర్గాల ప్రజల అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రతి గ్రామం నుండి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ప్రజలు వేలాదిగా తరలివచ్చి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## అంగన్‌వాడీ సెంటర్లో పోషణ పక్షోత్సవాలు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ని 1వ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. (ఈ పోషణ పక్ష కార్యక్రమం ఏప్రిల్ 8 నుండి 22 వరకు నిర్వహించడం జరుగుతుంది). ఇందులో భాగంగా మొదటి 100 రోజుల గురించి గర్భిణీ స్త్రీలను బరువు చూడడం, గర్భిణీ స్త్రీల సంరక్షణపై భర్తలకి, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమం, రెండు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి సిడిపిఓ బాలేశ్వరమ్మ, ఏసిడిపిఓ ఝాన్సీ లక్ష్మి, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, అంగన్వాడి టీచర్ కవిత, అంగన్వాడి హెల్పర్ సుజాత, ఆశ వర్కర్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో వైద్య శిబిరం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో జరుగుతున్న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీనియర్ విభాగం బండలాగుడు పోటీల్లో తిలకించేందుకు వచ్చిన ప్రజలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో డా. స్వప్న ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య సేవలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్య అధికారిణి డా. స్వప్న, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎఎన్ఎం వీణా, ఆశా కార్యకర్త పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ సెంటర్ గద్వాల కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన

**గద్వాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నెంబర్ 21 వల్ల కాంటాక్ట్ పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు ఆగమ్యగోచరముగా ఉండటంవల్ల జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు పీజీ సెంటర్ గద్వాల యందు నిరసన కార్యక్రమం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకి రెగ్యులరైజేషన్ చేయాలని, ఆది ఆలస్యము అయితే బేసిక్, హెచ్ ఆర్ ఎ,+డి ఏ,+3 యాన్వాల్ ఇంక్రిమెంట్ తో కూడిన జాబ్ సెక్యూరిటీ ఇవ్వాలనీ, పార్ట్ టైం అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యూనివర్సిటీ పీజీ సెంటర్ గద్వాల (పాలమూరు యూనివర్సిటీ),అధ్యాపకులు తరగతులు బహిష్కరించి, నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ యునివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డాక్టర్ మహేందర్, డాక్టర్ గోపినాథ్ రాథోడ్, వంగూరి గణేష్ పాల్గొన్నారు. అనంతరం అదనపు డ్యూటీ లకు రాజీనామా పత్రాలను పీజీ సెంటర్‌గద్వాల ప్రిన్సిపల్ డా.చవ్వా వెంకట్‌రెడ్డికి అందజేశారు.

## సన్న బియ్యం పంపిణీ

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పల్లి గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ ని మంగళవారం తహశీల్దార్ సుగుణ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రుక్కనపల్లి, సోలిపూర్, ఉప్పరపల్లి రేషన్ షాపులలో సన్న బియ్యం తీసుకుంటున్న వారిని బియ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. స్వయంగా పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా రేషన్ షాప్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి బియ్యాన్ని పంపిణీ చేయాలని సూచించారు. తహశీల్దార్ గిర్దావరు తిరుపతయ్య ఆయా గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు ఉన్నారు.

## వడదెబ్బ పై అవగాహన కల్పించాలి

**పానుగల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అశాడే సందర్భంగా వైద్య సిబ్బందికి ఆశాకార్యకర్తలకు సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఉపాధి పనులకు వెళ్లే వారికి పలు సూచనలు చేసి అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.అదే విధంగా అసంక్రమిత వ్యాధిగ్రస్తుల మధుమేహ స్క్రీనింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఎల్ హెచ్‌పి వైద్యాధికారులుకమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ రామయ్య, సూపర్వైజర్లు సుమన,శాంతమ్మ హెల్త్ అసిస్టెంట్లు రామ్ చందర్, సతీష్ కుమార్,మదన్‌బాబు,ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**మక్తల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గం చెందిన పలువురు లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణానికి చెందిన నరసింహ రెడ్డికి రూ. 50 వేలు, లింగంపల్లి గ్రామానికి చెందినవి.రాముకు రూ.60వేలు, కుమ్మరి అయ్యమ్మకు రూ.48వేల విలువ గల చెక్కులను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు ఓబులేష్, రాజేందర్, బోయ నరసింహ, ఫయాజ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

**చిన్నచింతకుంట,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం అల్లిపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడి పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థులు బట్టి విధానం స్వస్థ విధానాన్ని స్వస్తి పలకాలనిఆయన సూచించారు.విద్యార్థులకు బోధనలు ఉపయోగపడే బోధన సామాగ్రిని ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంపర్వీన్, గ్రామమాజీ సర్పంచ్ రఘువరన్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం మహేందర్ రెడ్డి, స్నేహ, సిఆర్‌పిలు విజయసింహ, ప్రవీణ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన ఈడి

**ఉప్పునుంతల, ఏప్రిల్8 ప్రభాతవార్త:** మండలంలో ప్రజా పాలన కేంద్రాన్ని బీసీ కార్పొరేషన్ ఇడి మంగళవారం సందర్శించారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారు రాజీవ్ యువశక్తి దరఖాస్తు చేసుకున్న వారు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారు కాపీలను కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ సూచించారు. ఆఫ్ లైన్, ఆన్లైన్ దరఖాస్తు దారులు ఈ నెల 14 వరకు ప్రజాపాలన కేంద్రంలో సమర్పించాలని ఈడీ, ఎంపిడిఓ మోహన్ లాల్ కోరారు. వారితోపాటు ప్రజాపాలన కార్యాలయం ఇంఛార్జి, శేఖర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ జాతర మండల కమిటీ ఎన్నిక

**నారాయణపేట టౌన్, ఏప్రిల్8 ప్రభాతవార్త :** అంబేద్కర్ జాతర దామరగిద్ద మండల కమిటీని మంగళవారం అంబేద్కర్ జాతర నారాయణపేట జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు చిన్నయ్య, ఉపాధ్యక్షులు గ్యాంగ్ హనుమంతు, దామరగిద్ద మాజీ ఎంపీపీ బక్క నరసప్ప,వత్తు గుండ్లగజలప్ప, బర్ల ఆనందు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గతుప రాములు కందేన్ పల్లి నరేందర్, మండల అధ్యక్షులుగా ఉద్మల్ గిద్ద భీమ్మప్ప, ఉపాధ్యక్షులుగా నింగరెడ్డిపల్లి రాములు, కానుకుర్తి ఆశప్ప, ప్రధాన కార్యదర్శి గతప భరత్, సహకార కార్యదర్శిగా లోకుర్తి రవీందర్, దామరగిద్ద రాజు, కోశాధికారిగా కంసాన్ పల్లి బాలప్ప, ప్రచార కార్యదర్శి దామరగిద్ద అంజి, సలహాదారులుగా క్యాతన్‌పల్లిఅంజప్ప,దామరగిద్ద హనుమంతు, క్యాతన్ పల్లి గోపాల్, సీఎం నరసింహ, మహాదేవ్,జోషిలను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామము నుండి అధిక సంఖ్యలో జనాలను తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతిమ్మప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**మల్దకల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం శేష వస్త్రాన్ని బహుకరించి, దేవాలయ విశేషాలను వివరిస్తూ తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా తత్పరత

**-వర్షానికి తడుస్తున్న వరిధాన్యాన్ని సురక్షితంగా సంచుల్లో నింపిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు**



ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

**భూత్పూర్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని మూడోవార్డు గోప్లాపూర్‌లో ప్రభుత్వ ఎంవీఎస్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన వారం రోజుల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ముగిసింది.ముగింపు సమావేశానికి ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పట్టణాలలో చదివే విద్యార్థులు జాతీయ సేవలో భాగంగా గ్రామాలలో పారిశుద్యం,పరిశుభ్రత,ప్రజారోగ్యం పట్ల అవగాహన కల్గించేందుకు ఎన్ఎస్ఎస్ఎంతో దోహదపడుతుందన్నారు.జాతీయ సేవా పథకం కింద విద్యార్థిని విద్యార్థులు వారం రోజుల పాటు సామూహికంగా ఉంటూ,సామూహికంగా కలిసి భోంచేస్తూ గ్రామాలు,పల్లెటూళ్లలో వాతావరణాన్ని సింహావలోకనం చేసుకుంటారన్నారు.జాతీయ సేవలో భాగంగా విద్యార్థులు పాల్గొన్న శిబిరానికిగాను వారికి ప్రమాణ పత్రాలను జారీ చేస్తామని, ఇట్టి ప్రమాణ పత్రాలు విద్య,ఉద్యోగాలలో ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు.



**వరుణుని బారి నుండి వరి పంటను కాపాడిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు:** ఆరుగాలం శ్రమించి పండించిన తమ వరి పంటను గోప్లాపూర్ రైతులు రోడ్లపై ఎండబెట్టగా అప్పుడే అకాల వర్షం పడింది,అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థిని విద్యార్థులు స్పందించి రంగంలోకి దిగి వరిపంట ధాన్యాన్ని ఆఘమేఘాల మీద సంచుల్లోకి నింపారు.ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవాతత్పరతను, సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు.తమ విద్యార్థులు వర్షంలో తడుస్తున్న వరి ధాన్యాన్ని సంచు ల్లోకి నింపి రైతులకు సహాయ పడిన తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్ని అభినందించారు. విద్యార్థుల సమైక్యతభావానికి,సహకార సేవాతత్పరతను ఎన్ఎస్ఎస్ ముగింపు శిబిరానికి హాజరైన పలువురు నాయకులు,గ్రామస్తులు విద్యార్థులపై ప్రశంసల జల్లు కురిపించారు.ఈ ముగింపు శిబిరానికి ప్రిన్సిపాల్ పద్మావతితో పాటు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి,భూత్పూర్ మున్సిపల్ అధికారి వెంకటరెడ్డి, శ్రీనివాసులు, కొండ స్వామి,కళాశాల సిబ్బంధి రవీందర్‌రావు ,సురేష్,సత్యనారాయణ, సత్యభాస్కర్, రాఘవేందర్ రావ్,మల్లిఖార్జున్‌లతో పాటు గోప్లాపూర్ గ్రామానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తూము శ్రీనివాస్‌రెడ్డి,మాజీఎంపీటీసీ సభ్యుడుమేకలసత్యనారాయణ,గంగాపురంశ్రీనివాసులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పోషణ పక్షోత్సవాలు

**మల్దకల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** అంగన్వాడి కేంద్రం ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన గర్భిణీ స్త్రీల సమావేశం లో పాల్గొని గర్భిణీ స్త్రీ ఆరోగ్యంపై 1000 రోజుల ప్రాముఖ్యత గురించి గర్భిణుల్లో కచ్చితమైన బరువు పెరుగుదల గురించి, 2 సంవత్సరాల లోపు వయసు గల పిల్లల సంరక్షణలపై ఆరోగ్య సలహాలు,సూచనలు, పోషకాహార జాగ్రత్తలుపాటించాలని ఆ కాలనీ వాసుల కు వివరించడం జరిగింది. "పోషణ పక్షం" కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని తెలియజేశాము.అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లల బరువులు ఎత్తులు తూచడమైనది. ఈ కార్యక్రమంలో మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగరాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుమలేష్, చైల్డ్ లైన్ ప్రకాష్, బ్లాక్ కోఆర్డినేటర్ శశికళ పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్స్ సురేఖమ్మ, లక్ష్మీ,రంగమ్మ, మహేశ్వరమ్మ, నవీన, పుష్ప, సునీత, గర్భిణీ స్త్రీలు ఎజీ గర్ల్స్ తల్లులు, హాజరయ్యారు.

## కేంద్ర ప్రభుత్వ పథాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**◆ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు**



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

**మల్దకల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మంగళవారం మల్దకల్ మండల బీజేపీ అధ్యక్షుడు బి. తిరుపతి రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారని ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయడం లేదన్నారు.సన్న బియ్యం ఇస్తున్నామని సంకలు కొట్టుకుం టున్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కేజీల సన్న బియ్యం గురించి చెప్పండా దొంగ డ్రామాలు ఆడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పేదలకు ఇండ్లు ఇస్తూ...వాటికి ఇందిరమ్మ ఇండ్లని పేరు పెట్టడం దారుణమన్నారు. ప్రతి రేషన్ షాప్ దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ను అధికారికంగా పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులని గెలిపించి దొంగ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మన సత్తా ఏంటో చూపెట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు, జిల్లా కౌన్సిలర్ మెంబర్ రెడ్డప్ప సీనియర్ నాయకులు దోమ నాగరాజు,డి.వెంకటేశ,తిమ్మారెడ్డి,కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి,కాజా గోకారి, లోకరాజు, నాగరాజు, సాయినాథ్‌రెడ్డి, ప్రసాద్,బలరాం ,తిరుమల్,రంగస్వామి,ఈరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెంటేపల్లి గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలి

**గ్రామదేవత సవరమ్మకు మొక్కు తీర్చుకున్న మెంటపల్లి పురుషోత్తంరెడ్డి**

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మెంటపల్లి గ్రామంలో సవారమ్మ దేవతకు బోనం సమర్పించే ఉత్సవం సందర్భంగా మంగళవారం బిజెపి రాష్ట్ర నాయకులు మెంటపల్లి పురుషోత్తం రెడ్డి అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మెంటేపల్లి గ్రామం ఆయురారోగ్యాలతో పాడిపంటలతో వర్ధిల్లాలని ఆయన గ్రామ దేవతకు వేడుకున్నారు. గ్రామ దేవత అయిన సవారమ్మ తల్లికి ప్రతి ఏటా బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. మొక్కు తీర్చుకోవడం వల్ల దేవతా ఆశీర్వాదంతో గ్రామంలో పాడి పంటలు, పశు సంపద వృద్ధి చెందుతుందని, గ్రామస్తులు ఆయురారోగ్యంతో క్షేమంగా ఉంటారని గ్రామస్తుల ప్రగాఢ నమ్మకం అని పేర్కొన్నారు. గ్రామస్తులంతా వారి కుటుంబ సమేతంగా వచ్చి నైవేద్యం సమర్పించి కోళ్లతో అమ్మవారికి మొక్కు తీర్చుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ఆత్మకూర్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**ఆత్మకూరు, ఏప్రిల్8 ప్రభాతవార్త:** ఆత్మకూరు మండల మొబైల్ దుకాణాల యజమానులు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో మంగళవారం మండల పరిధిలోని మొబైల్ షాప్ లో యాజమాన్లు నూతన అధ్యక్షులుగా ఆత్మకూర్ పట్టణానికి చెందిన కట్టా మహేష్ ,ఉపాధ్యక్షులుగా బాలు, ప్రధాన కార్యదర్శిగా ఖాజామైనది, సహాయ కార్య దర్శిగా యూసుఫ్, మండల కార్యవర్గానికి ప్రధాన సలహాదారులుగా బషీర్ లను ఎన్నుకున్నట్లుగా అధ్యక్షుడు కట్ట మహేష్ విలేకరులకు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## కొన్నూరులో అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన రాచాల



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాచాల

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్8 ప్రభాతవార్త :**వనపర్తి జిల్లా మదనాపూర్ మండలం కొన్నూరు గ్రామంలో బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ. వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గూడూషా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండుతున్న ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు అంబలి కేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని, ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామా నికి విచ్చేసినసందర్భంగా రాచాలను శాలువా, పూలమాలతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, మండల అధ్యక్షులు మహేందర్ నాయుడు, మండల కన్వీనర్ నరసింహ యాదవ్, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, చెలిమిల్ల రామన్ గౌడ్, శేఖర్, గ్రామస్తులు బాలేమియా, కుర్మయ్య, ఖాజా, మొగులయ్య, మురళి, మహేష్, పెంటన్న,శివ, బాలరాజు, రవి పాల్గొన్నారు.

## బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

**◆ జిల్లా బాలల పరిరక్షణ కమిటీ అధికారి జోగురవి, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ సుజాత**



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయని అలాగే 18 సంవత్సరాలలోపు వారికి బాల్య వివాహం చేస్తే కూడా మరిన్ని కఠిన చర్యలు ఉన్నాయని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ అధికారి జోగు రవి, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ సుజాత అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలకేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో గ్రామస్థాయి బాలాల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా మానవపాడు చైల్డ్ ప్రాజెక్టు డెవలప్మెంట్ అధికారి సుజాత హాజరై మాట్లాడుతూ మాట్లాడుతూ పిల్లల కోసం రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేకమైన హక్కులు కలిగి ఉన్నారని బాలల చట్టాల పై వాటి ప్రాముఖ్యత పై అవగాహన కల్పిం చారు. బాలల హక్కులు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కు లపై వివరిస్తూ అదే విధంగా అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు ,గర్భిణీ స్త్రీలకు, కిశోర బాలికలకు పౌష్టికా హ్నార. ,ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా వచ్చే లాభాలు ప్రయోజనాల గురించి వివరిస్తూ మంచి ఆహారాన్ని తీసుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి జోగు రవి మాట్లా డుతూ బాలల హక్కులను కాపాడాలని మరియు పిల్లలు యొక్క హక్కులను వారు పొందే విధంగా చూడాలని సూచించారు. బాలల కోసం కొన్ని చట్టాలు ప్రత్యేకంగా ఉన్నాయని బాల్య వివాహాలపై అమ్మాయికి కనీసం 18 సంవత్సరాలు పూర్తిగా నిండి ఉండాలని అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని బాల్యవివాహం ఎవరైనా చేసినట్లయితే ఈ చట్టం ప్రకారం 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని అలాగే బాల్యవివాహం చేసుకోవడం ద్వారా వచ్చేనష్టాలు సమస్యలపై అవగాహన కల్పించారు.బాలలపై లైంగిక వేధింపుల చట్టం ప్రకారం అమ్మాయిలపై ఎవరైనా లైంగిక వేధింపులు పాల్పడినట్లయితే వారికి కనీసం 7సంవత్సరాల వరకు జైలుశిక్ష ఉంటుందని పరిచయం లేని వ్యక్తు లకు దూరం గా ఉండి మాట్లాడాలనివారు చెప్పే మాయమాటలు విని మోసపోవద్దని పిల్లలు వేధింపులకు గురవుతుంటే 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని 24 గంటల పాటు పిల్లల రక్షణ కోసం పనిచేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగన్న, పాఠశాల ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, మహేశ్వరి, అంగన్వాడి టీచర్లు,సుజాత,సువర్ణ, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలి

**జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వి.రజని**



**పానుగల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** విద్యార్థులు పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించాలి అని పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా చదివి అందరూ మంచి మార్కులు సాధించాలి అని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. మంగళవారం పానగల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. మైనర్ బాలికలు అంగీకరించి చేసుకున్న పెళ్లిలు చట్ట ప్రకారం చెల్లవు అని పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు అవుతుందని తెలిపారు. అదేవిధంగా మైనర్ బాలిక అనుమతితో శారీరకంగా కలిసిన అత్యాచారం కింద కేసులు నమోదుఅవుతాయని తెలియజేశారు.కార్యక్రమం ముఖ్య ఉద్దేశమైన చట్టాలను వివరించడంలో భాగంగా భారతీయ నాగరిక సురక్ష సంహిత,భారతీయ న్యాయ సంహిత గురించి తెలియజేయడంతో పాటు వినియోగదారుల చట్టం బాల్యవివాహాల చట్టం మోటార్ వెహికల్ యాక్ట్ బాల కార్మికుల చట్టం సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేశారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి ఉత్తరయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏం రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**■ బీజేపీ జిల్లా కార్యదర్శి డీకే స్నిగ్ధ రెడ్డి**



బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి డీకే స్నిగ్ధరెడ్డి

**గద్వాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ 45 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా"గావ్ చలో బస్తీ చలో" అభియాన్ కార్యక్రమం సందర్భంగా మంగళవారం ధరూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తిమ్మా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి డికె. స్నిగ్దా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డికె. స్నిగ్దా రెడ్డి మాట్లాడుతూ గావ్ చలో బస్తీ చలో అభియన్ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రవాసి కార్యకర్తలు ప్రతి వార్డ్ లో ప్రతి వీధికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. వార్డ్ స్థితిగతులను పరిశీలించి ఆ వార్డ్ లో బూత్ కమిటీలను అధ్యయనం చేసి అక్కడ ఉన్నటువంటి వివిధ సంఘాల నేతలను, కవులు, కళాకారులు, క్రీడాకారులను కలిసి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి ఆ వార్డ్ లోని సమస్యల గురించి చర్చలు జరపాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ ప్రభుత్వంచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోవు స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగొట్టి యావత్ దేశ ప్రజలను విశ్వాసాన్ని చురగొనాలని పిలుపునిచ్చారు. 10,11,12 తేదీలలో అంగన్వాడీ కేంద్రం లేదా పాఠశాల, సరస్సులు, చెరువుల,కుంటలు వంటి నీటి వనరుల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేయలని బిజెపి జెండాలు పట్టుకొని పార్టీ కార్యకర్తలతో కలిసి అన్ని వీధుల్లో ఊరేగింపు తో పాటు బూత్ కమిటీ సమావేశం గ్రామస్తులతో ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ సంజీవ్ భరద్వాజ్, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, మండల కౌన్సిల్ మెంబర్ రాజేష్ అయ్యా సీనియర్ నాయకులు దరూర్ కిష్టాన్న, మార్లబీడు జనార్దన్‌రెడ్డి, హనుమంత రాయ ఉన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**వనపర్తి ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. కిరణ్మయి**



మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌ను శాలువాతో సన్మానిస్తున్న పి. సురేష్

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ సూపర్ వైజర్ కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటామని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. కిరణ్మయి అన్నారు. మంగళవారం తెలంగాణ మెడికల్‌కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పారిశుద్ధ్య సెక్యూరిటీ కార్మికులతో కలిసి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డా. కిరణ్మయిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం కార్మికుల తక్షణ, దీర్ఘకాలిక సమస్యలను ప్రిన్సిపల్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కిరణ్మయి మాట్లాడుతూ. కార్మికులకు ఏలాంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం వైద్య ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక అధ్యయనం చేస్తుందని వివరించారు. పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అతి ముఖ్యమైనదని అన్నారు. త్వరలోనే కార్మికుల సమస్యలపై యూనియన్ నాయకులు కార్మికులు ఏజెన్సీ నిర్వాహకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య భద్రత రోగి సంరక్షణ నిర్వహణ కోసం గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) పేరుతో మూడు సంవత్సరాల కాల వ్యవధితో 2022లో టెండర్ పాలసీతో వివిధ ఏజెన్సీలను ఎంపిక చేసిందని వాటి కాలం రిమితి దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.24,000 అందే విధంగా 2025 నూతన టెండర్ పాలసీ ముసాయిదా తీసుకొచ్చి టెండర్ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాల పెంపు ఏకైక ఎజెండాతో రాష్ట్రవ్యాప్త పోరాటానికి సిద్ధమవుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. రోహిణి,ఏఐటీయూసీ యూనియన్ నేతలు కార్మికులు వరుణ్, శేఖర్,సైదాబేగం, మన్నెమ్మ,లక్ష్మి, బొజ్జమ్మ,రాజేశ్వరి,లత, నారమ్మ, శారద,భారతి, శివలీల, శ్రీదేవి, లావణ్య, లక్ష్మి, శోభ, రాజేశ్వరి,పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలలో సిసి రోడ్లు నిర్మాణం

**■ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యురాలు అక్కల రమా సాయిబాబా**



ఎర్రవల్లిలో బిజెపి నాయకులతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అక్కల రమ సాయిబాబా

**ఇటిక్యాల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నారని అదే విధంగా సన్న బియ్యం పంపిణీలో కూడా కేంద్ర ప్రభుత్వానివి 5 కేజీల బియ్యం, రాష్ట్ర ప్రభుత్వానివి ఒక్క కేజీ బియ్యము మాత్రమే పంపిణీ చేస్తున్నారని రాష్ట్ర బిజెపి పార్టీ కౌన్సిల్ సభ్యురాలు మాజీ మున్సిపల్ చైర్మన్ అక్కల రామా సాయిబాబా అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో మండల బిజెపి పార్టీ జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యుల సమావేశం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అక్కల రమ సాయిబాబా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారని ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయడం లేదన్నారు. అంతేకాక రేషన్ షాపులో తెల్ల కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తున్నామని గొప్పలుచెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కేజీల సన్న బియ్యం గురించి చెప్పకుండా అబద్ధపు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పేదలకు ఇండ్లు ఇస్తూ, వాటికి ఇందిరమ్మ ఇండ్లని పేరు పెట్టడం దారుణమన్నారు. ప్రతి రేషన్ షాప్ దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను అధికారికంగా పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులని గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మన సత్తా ఏంటో చూపెట్టాలని నాయకులను కార్యకర్తలను ఆదేశించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిని బిజెపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కార్యదర్శి స్వప్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, విజయ్, పరుశరాం, నరేష్, నరసింహ రెడ్డి, రాముడు, యాదగిరి, నరేష్ గౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

**ఆత్మకూరు, ఏప్రిల్8 ప్రభాతవార్త:** విద్యార్థినీ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో పోటీ ప్రపంచం నెలకొన్న నేపథ్యంలో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆత్మకూర్ ఎస్సై నరేందర్ విద్యార్థులకు సూచిం చారు. మంగళవారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణం లోని శ్రీవాణి పాఠశాలలో జరిగిన స్కౌట్స్ గైడ్స్ పథకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ క్యాంపులో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం అభినందనీయమన్నారు. శ్రీవాణి పాఠశాల నుండి 190 మంది విద్యార్థిని విద్యార్థులకు స్కౌట్స్,గైడ్స్ పథకాలను ఎస్సై నరేందర్ అందజేశారు. విద్యార్థి దశ నుండే విద్యార్థిని విద్యార్థులు దేశభక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం నిర్వహించిన క్యాంపు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్వైజర్ టీజే విశ్వేశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ లత విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై ఏఐవైఎఫ్ నిరసన

**అమరచింత, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ ఆరోపించారు. మంగళవారం అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని నాలుగో వార్డులో ఏఐవైఎఫ్ కార్యకర్తలతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండి కుతుబ్, మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదల పాలిట శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్‌పై రెండు రూపాయల సుంకం విధించడానికి ఆయన వ్యతిరేకించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలుఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఇప్పటికే ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని దేశంలో సామాన్య ప్రజలకు పెంచిన ధరలతో చుక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. నిత్యం పేదలవాడే గ్యాస్ పెట్రోల్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అనురాగ్, మార్టిన్, విజయ్, ఆదర్శ్, పార్థు, విశాల్, నితిన్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మక్తల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరంపనిచేస్తున్నదని మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి అన్నారు. మక్తల్ మండలంలోని కర్నిలో మంగళవారం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పథకం చారిత్రాత్మకమని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, నాయకులు కృష్ణయ్యగౌడ్, కటికెలి హనుమంతు,గాజుల మహబూబ్ పాషా, ఎద్దుల హనుమంతు, వాకిటి హన్మంతు, ఈద కిష్టప్ప, నాగరాజు, డీలర్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం నిరుపేదలకు వరం

**◆ కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షులు కొత్త నాగేశ్వరరావు**

**లింగాల, ఏప్రిల్8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండలధ్యక్షులు కొత్త నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్, వల్లభాపూర్, బాకారం గ్రామంలోని సన్నబియ్యం పథకాన్ని గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండలధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డులోని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. ధనవంతులే సన్న బియ్యం తింటున్న ఈ రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వంలో నిరుపేదలకు సన్నబియ్యం పథకం తీసుకోచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలు ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పూజారి వెంకటయ్య, యువజన కాంగ్రెస్‌ఉపాధ్యక్షులు రాజేష్, గ్రామ యువజన నాయకులు సాయి యాదవ్, నిరంజన్, రేషన్‌డీలర్ ఇక్బాల్ ఖాన్, మండల పార్టీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఎల్లికంటి కాశన్న, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షురాలు జలగం ఎల్లమ్మ, బాతుక పద్మ ,అనసూయ, కలమ్మ ,రాములమ్మ, హాసీనా,మన్నెమ్మ, మల్లేష్ ,తిరుపతి రెడ్డి, విష్ణు, బాలకృష్ణ,నిరంజన్,బాలస్వామి ఫెరోజ్, శ్రీశైలం, అర్జున్, చందు, శేఖర్, రాములు, శివ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేయాలి

**◆ ఆర్బిఐ లీడ్ జిల్లా ఆఫీసర్ డిబోజిత్ బౌరా**

**లింగాల, ఏప్రిల్8 ప్రభాతవార్త:** మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలను మరింత చేరువ చేయాలని ఆర్బిఐ లీడ్ డిస్టిక్ ఆఫీసర్ డిబోజిత్ బౌరా అన్నారు. మంగళవారం లింగాల మండల కేంద్రంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ద్వారానిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు.గ్రామీణ ప్రాంతా ప్రజలకు బ్యాంకు సేవలపై ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ క్రైమ్ మోసాలపై గ్రామీణ ప్రాంతా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట లీడ్ నాగర్ కర్నూలు డిస్ట్రిక్ట్ లీడ్ మేనేజర్ శ్రీనివాసరావు, యూబీఐ ఆఫీసర్ లక్ష్మణ్, ఎఫ్ఎల్‌సి శేషయ్య,లింగాల సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు ఎండి మన్సూర్, రూపేష్, శ్రీశైలం ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకుంటే గిట్టుబాటు ధర పొందడానికి ఆస్కారం ఉంటుందని ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పిఎసిఎస్, దామరగిద్ద మండలం నర్సాపూర్, మల్ రెడ్డిపల్లి గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతు సంక్షేమాన్ని కోరుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రబీలో రైతులు పండించిన వరిపంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుంటే గిట్టుబాటు ధర పొందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రైవేటు షాపుల్లో ధాన్యాన్ని విక్రయించి నష్టపోరాదన్నారు. ప్రతి రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికిక్వింటాలుకు రూ.2320 ఉండగా, సాధారణానికి క్వింటాలకు రూ. 2300 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హనుమంతు,నరసింహారెడ్డి,సలీంతో బాటు జిల్లా, వివిధమండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

